మిర్చికి తెగులు కాటు

- కుళ్లిపోయి రాలిపోతున్న కాయలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- తీవ్ర నష్టం తప్పదని ఆవేదన

సంజామల: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన మిర్చి పంటకు తెగులు కాటు వేస్తోంది. కాయలకు మచ్చలు వచ్చి కుళ్లిపోయి రాలిపోతున్నాయి. ఏమి చేయాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటను చూసి తల్లడిల్లిపోతున్నారు. నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలిసిరాని మిరప పంట

పండించిన పంట ఇంటికి వచ్చే వరకు నమ్మకాలు లేని పరిస్థితి. ఏ రూపంలో నష్టం వస్తుందో తెలియదు. ప్రస్తుతం మిరప చేతికందే సమయంలో కొత్త తెగులు వచ్చి అన్నదాతను ముంచింది. ఈ ఏడాది మిరపకు కాయపడే సమయంలో మచ్చలు ఏర్పడి కుళ్లిపోయి రాలిపోతున్నాయి.

మండలంలో 5500 ఎకరాల్లో సాగు

ఆరు నెలలు కష్టపడి పండించిన పంటకు చివరి దశలో వచ్చిన తెగులు రైతన్నను కలవరపెడుతున్నాయి. సంజామల మండల వ్యాప్తంగా సుమారు 5,500 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఎస్సార్‌బీసీ కాలువలు, వాగులు, బావులు, బోర్ల ఆధారితంగా మిరప సాగు చేశారు. నీరు సకాలంలో అందించినా పంటకు ఏదో ఒక రోగంతో రైతు ఆగమాగం అవుతున్నాడు. మిరప మొదటి దశ నుంచే బాగా వచ్చింది. అంతా బాగుంది అనుకునేలోగా కాయ కుళ్లిపోయి రాలిపోతుంటే రైతు ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. సాధారణంగా మిరపలో ఆకుముడత, త్రిప్స్, నల్లి, తామరపురుగు, పచ్చదోమ, తెల్లదోమ, రసం పీల్చే పురుగు, వేరుకుల్లు, పండాకు తెగులు, బొబ్బర వైరస్, జెమిని వైరస్ తదితర తెగుళ్లు మిరప పంటను ఆశిస్తాయి. అయితే ప్రస్తుతం వచ్చిన తెగుకు అంతుపట్టడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కుళ్లిపోయిన మిరపకాయలు

ఆకుమల్లలో సాగు చేసిన మిర్చి పంట



వాతావరణం అనుకూలించలేదు



ఈ ఏడాది రెండు ఎకరాలు మర్చి సాగు చేశాను. కాసులు కురిపిస్తుందని మిరప పంట వేస్తే ఈసారి మాత్రం మిరప పంటకు వాతావరణం అనుకూలించలేదు. మొదటి నుంచి పంటను కాపాడుకుంటూ వచ్చాం. పూతకు వచ్చే సమయంలో తుపాన్, మబ్బులు కారణంగా పూత రాలిపోయింది. ఉన్న పంట అయినా బాగా వస్తుందని అనుకునేలోపు కాయ ఇలా కుళ్లిపాయి రాలిపోతోంది. కష్టం మొత్తం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. –హాజివలి, మిర్చిరైతు, ఆకుమల్ల

తేమ శాతం ఎక్కువైంది



చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో తేమ శాతం అధికమైంది. అందుకే మిరపకు నష్టం కలుగుతోంది. మిరప తోటలో తేమ ఆరబెట్టాలి. తర్వాత నీరు అందించాలి. తేమపై మళ్లీ నీరు అందిస్తే పూత, కాయ రాలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. –సుధాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి, సంజామల

క్లుప్తంగా

కోవెలకుంట్లలో 19 వాహనాలు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు లభ్యం కాలేదు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని 16 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాలనీలో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే తెలియజేయాలని సూచించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుల ఎన్నిక



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

డోన్ టౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం నూతన అధ్యక్షులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సంఘీయుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల చైర్మన్‌గా కొట్రికె ఫణిరాజ్ వ్యవహరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, ఆర్యవైశ్య యువజన సంఘానికి కామిశెట్టి విద్యాసాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని ఎన్నికల చైర్మన్ తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులను ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి, మురారి నరసింహయ్య, ఆర్సీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కోట్లకు మంత్రి బీసీ పరామర్శ

డోన్ టౌన్: డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డిని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని కోట్ల నివాసంలో ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సీపీఐ నేత మృతికి నివాళి

డోన్ రూరల్: స్థానిక సీపీఐ నాయకుడు మాలెళ్ల మస్తాన్ మృతిపై ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.సుంకయ్య, మోటారాముడు, అబ్బాస్ సంతాపం తెలిపారు. మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఘనంగా యోగి వేమన జయంతి



నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

బేతంచెర్ల: తెలుగు వారి హృదయాల్లో ప్రజాకవిగా యోగి వేమన నిలిచిపోయారని మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బుగ్గన రామకృష్ణారెడ్డి, నాగభూషణం రెడ్డి, రమేష్ రెడ్డి, జస్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడికి అంత్యక్రియలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట చెలిమ వద్ద ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం ప్రాంగణంలో వెంకట సుబ్బయ్య (70) అనారోగ్యంతో మృతిచెందాడు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో భార్య, కూతురు విజ్ఞప్తి మేరకు ఆ నలుగురు సభ్యులు హెచ్ కొట్టాల గ్రామ శ్మశాన వాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మీ రాఘవ, అక్బర్, వన్నూర్ బాషా, డాక్టర్ సద్దాం, మధు విక్రమ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: చేసిన తప్పులను తెలుసుకుని గొడవలకు దూరంగా శాంతియుత జీవనం గడపాలని సీఐ డి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రమేష్ బాబుతో కలిసి మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారా, జూదం, మట్కా తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామ సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. ముక్కమల్ల గ్రామానికి చెందిన వీరంతా గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.2,400 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

ముగిసిన సంక్రాంతి క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ పోటీల్లో 23 జట్లు పాల్గొన్నాయి. చివరి రోజు ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. బేతంచెర్ల మార్నింగ్ టీమ్ జట్టు విజేతగా నిలిచింది. చింటూ టీం రన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి రూ. 20 వేలు, రన్నర్ జట్టుకు ఉపాధ్యాయుడు శంకర్ నాయక్ సహకారంతో రూ. 10 వేల నగదు, ట్రోఫీని పారిశ్రామికవేత్త కార్తీక్ రెడ్డి, వార్డు మెంబర్ మునిస్వామి చేతుల మీదుగా అందజేశారు.



ముదిగేడు సచివాలయం ఎదుట నిర్మించిన హోటల్

సచివాలయ స్థలం కబ్జా

సంజామల: టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకుల దౌర్జన్యాలు, కబ్జాలు పెరిగిపోతున్నాయి. ఖాళీ స్థలాలు కనపడితే చాలు పాగా వేసేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు కాపాడాల్సిన అధికారులే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని ముదిగేడు గ్రామ సచివాలయం స్థలంపై ఓ వ్యక్తికి కన్నుపడింది. సచివాలయం కనపడకుండా ఏకంగా రేకుల షెడ్ ఏర్పాటు చేసి హోటల్ నడుపుతున్నాడు. అక్కడే బెల్ట్‌షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్నాడు. అక్కడే మందుబాబులు తాగి తిరుగుతుండడంతో సమస్యలు విన్నవించేందుకు, వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమీ చేయలేమని బహిరంగంగానే సమాధానం చెబుతున్నారు. స్థలం ఆక్రమించుకున్న ఆ వ్యక్తికి స్థానిక టీడీపీ నాయకుల అండదండలు ఉండడంతో స్థానిక అధికారులు గప్‌చుప్ అయ్యారు. మాట్లాడితే మంత్రికి చెప్పి బదిలీ చేయిస్తారనే భయంతో అధికారులు మిన్నకుండిపోయారు. అక్రమ షెడ్ నిర్మాణం గురించి పంచాయితీ కార్యదర్శిని వివరణ కోరగా.. ప్రభుత్వం స్థలంలో షెడ్ నిర్మించడం తప్పు అని చెప్పినా వినకుండా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కాగా అదే గ్రామంలో చవ్వా దస్తగిరి, చవ్వా సూర్యనారాయణ, శివుడు సొంత స్థలంలో అక్రమంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. బాధితులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు.



సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బనగానపల్లె: మండలంలోని నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి హెచ్ఎం పక్కిరెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, కుమార్ బాబు, శ్రీనివాసప్రసాద్, ఓబులరెడ్డి, పద్మావతి సావిత్రమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, శివరాం, నరసింహా, సుధీర్, కల్పన, విమల, శిరీష, సువర్ణ, సుమలత, ఫారూఖ్ సహా మొత్తం 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



శివవరంలో పైప్‌లైన్ లీక్‌తో వృథాగా పోతున్న నీరు



నీటి నిల్వతో మురుగుగా మారిన ప్రదేశం

నీటి వృథా... తప్పదు వ్యథ

మండల పరిధిలోని శివవరం గ్రామంలో తాగునీటి పైప్‌లైన్లు పలుచోట్ల లీకేజీ అవుతుండడంతో నీరు వృథాగా పోతుంది. అవుకు నుంచి శివవరం రోడ్డులో పైప్‌లైన్, ప్రాథమిక పాఠశాల (పాతది) వద్ద ఉన్న పైప్‌లైన్, ఊరి చివరలో ఎస్సీ కాలనీ ప్రధాన రహదారిలో ఉన్న పైప్‌లైన్లు కొంతకాలం నుంచి దెబ్బతిన్నాయి. దీంతో నీరు వదిలిన సమయంలో పైప్‌లైన్ల నుచి నీరు వృథాగా పోతోంది. ఈ నీరు వెళ్లే దారిలేక అక్కడే నిల్వ చేరడంతో మురుగుగా మారుతోంది. మురుగు నీరుపై దోమలు చేరుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. మురుగునీటిపై కనీసం బ్లీచింగ్ కూడా చల్లటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పలు కాలనీలకు తాగునీటి సమస్యతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వాపోతున్నారు. –అవుకు

వ్యక్తిగత దాడులను రాజకీయం చేయడం తగదు

- వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం సిగ్గుచేటు
- మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు



మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: మున్సిపల్ వైస్ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం నేత కొట్రికె హరికిషన్‌పై జరిగిన దాడి దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డితో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరికిషన్‌పై దాడి ఘటనను ఖండించారు. హరికిషన్‌పై దాడికి కారణాలు తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీ, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై కొందరు టీడీపీ నాయకులు ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. తమ పార్టీ హరికిషన్‌ను గుర్తించి కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పదవులతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నియమించిందని గుర్తు చేశారు. వ్యక్తిగత కక్షలతో దాడి జరిగితే ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టడం తగదన్నారు. హరికిషన్‌పై హత్యాయత్నం జరిగిందని గగ్గోలు పెడుతున్న టీడీపీలోని కొందరు ఆర్యవైశ్య సంఘం నాయకులకు పారిశ్రామిక వేత్తలు బచ్చు జయశీల గుప్త, మురారి నరసింహయ్య, మాకం కుటుంబాలను టీడీపీ నాయకులు నానా దుర్భాషలాడి అవమానించినప్పుడు ఆర్యవైశ్యులు గుర్తుకు రాకపోవడం శోచనీయం అన్నారు. తమ హయాంలో ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ, మాజీ మంత్రి బుగ్గనను ఆర్యవైశ్యులకు ఉన్న సత్సంబంధాలను దెబ్బతీసేందుకే టీడీపీ నాయకులు హరికిషన్‌పై దాడి ఘటనను వాడుకుని రాజకీయం చేస్తున్నారని తెలిపారు.

గతంలో జరిగాయా?

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో డోన్ నియోజకవర్గంలో హత్యాయత్నం లేదా దాడి ఘటనలు ఒక్కటి కూడా జరగలేదనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. అందరూ ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ హయాంలోనే ఇలా ఎందుకు జరిగిందో వారే ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. బురద జల్లడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, రైల్వే నాగేంద్ర, పార్టీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, ధర్మారం శ్రీను, మహేంద్రనాయుడు, శ్రీనివాసులు, దొరపల్లె చిరంజీవి, గొల్ల రాజు, వెంగళరెడ్డి, మల్కాపురం మద్దయ్య, వంశీ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు

ప్యాపిలి: మండలంలో సోమవారం నుంచి పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మాధవరం, చిన్నపొదిళ్ల, జలదుర్గం గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. 21వ తేదీ గార్లదిన్నె, పెద్దపొదిళ్ల, ఊటకొండ, 22న మునిమడుగు, హుసేనాపురం, 23న కలచట్ల, 24న నేరేడుచెర్ల, మెట్టుపల్లి, కొమ్మేమర్రి, 25న బూరుగల, చంద్రపల్లి, 27న బోయిన్‌చెర్వుపల్లి, వెంగళాంపల్లి, పీఆర్ పల్లి, 28న రాచర్ల, గుడిపాడు, 29న ఎస్ రంగాపురం, 30న ఏనుగుమర్రి, జక్కసానికుంట్ల తదితర గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోండి

అవుకు: మండలంలో జరిగే పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అవుకు పశువైద్యురాలు భారతీదేవి తెలిపారు. సోమవారం సంగపట్నం, 21వ తేదీ మెట్టుపల్లె, నిచ్చెనమెట్ల, 22న గుండ్లశింగవరం, అవుకు, 23న చనుగొండ్ల, రామాపురం, 24న చెర్లోపల్లె, శింగనపల్లె, 25న అన్నవరం, 26న రామవరం, 27న కొండమనాయునిపల్లె, శివవరం, 28న సుంకేసుల, ఉప్పలపాడు, 30న జూనూతల, వేములపాడు, 31న చెన్నంపల్లె, కునుకుంట్ల గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలో సోమవారం నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు కోవెలకుంట్ల పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. మొదటి రోజు బిజనవేముల, 21న కలుగొట్ల, 22న అమడాల, రేవనూరు, 23న వెలగటూరు, 24న చిన్నకొప్పెర్ల, సౌదరదిన్నె, 25న కోవెలకుంట్ల, పెద్దకొప్పెర్ల, 27న గుళ్లదూర్తి, లింగాల, 28న వల్లంపాడు, పొట్టిపాడు, 29న భీమునిపాడు, జోళదరాశి, 30న గుంజలపాడు, 31న కంపమల్లలో వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోకుల్ లక్ష్మి అధ్యక్షతన గురువారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గత మూడు నెలల్లో ఆయా శాఖల్లో జరిగిన ప్రగతి నివేదికలు కార్యాలయ మెయిల్‌కు ఈ నెల 21వ తేదీలోగా పంపాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని పేర్కొన్నారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, రెడ్డిపల్లె, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్టీ సాధనకు ఉద్యమిద్దాం


డోన్: ఎస్టీ సాధనే లక్ష్యంగా వాల్మీకులంతా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ వసతి గృహంలో జిల్లా స్థాయి వాల్మీకి న్యాయవాదుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం నాయకులు నాగభూషణం నాయుడు, మాధవకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశంలో భాస్కర్ నాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రా ఏజెన్సీ ప్రాంతాల్లో వాల్మీకులను ఎస్టీలుగా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో బీసీలుగా పరిగణించి వాల్మీకుల రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్నారన్నారు. ప్రాంతీయ వ్యత్యాసాన్ని తొలగించి వాల్మీకులనంతా ఎస్టీలుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ కార్యచరణను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించారు. వాల్మీకి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు, న్యాయవాదులు గోపాలకృష్ణ, స్వాములు, మద్దిలేటిస్వామి కృష్ణమూర్తి, మీనిగ కుమారి, శివరామకృష్ణ, రాజేష్, శ్రీరాములు, ప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో వాల్మీకి సంఘం న్యాయవాదులు

యురేకా సైన్స్ ఎక్స్‌పోను విజయవంతం చేయండి

డోన్ టౌన్: యురేకా సైన్స్ ఎక్స్‌పో 2025లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎక్స్‌పోకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, సుస్థిర అభివృద్ధి, మూఢ నమ్మకాలు శాస్త్రీయ దృక్పథం అనే మూడు అంశాలపై లోకాస్ట్, నోకాస్ట్‌తో మూడు నుంచి ఐదు నిమిషాల వీడియో తీసి గూగుల్ ఫామ్ లింక్ ద్వారా ఫిబ్రవరి 15వ తేదీ లోపు పంపాలన్నారు. 8,9,10వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో మూడు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్స్ అందిస్తామన్నారు. ప్రతి విద్యార్థి పాల్గొనే విధంగా హెచ్ఎంలు ప్రోత్సహించాలని కోరారు. జేవీకే నాయకులు లతీఫ్, రామమూర్తి, సుబ్బరాయుడు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసుకున్న గుండ్లు



ఇప్పటికీ పాత పద్ధతే..!

కాలం కొత్త పుంతలు తొక్కుతోంది. ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులోకి రావడంతో వంటింట్లో మహిళలు క్షణాల్లో వంటలు చేసేస్తున్నారు. మిక్సీలు, గ్రైండర్లు అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ ఆ ఊరిలో పాత పద్ధతినే అనుసరిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని కొండమీదపల్లె గ్రామం.. పేరుకు తగ్గట్లుగానే 600 అడుగుల ఎత్తులో ఊరు ఏర్పాటై ఉంది. అక్కడంతా రెడ్డి సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పూర్ణం, మసాలాలు, కారం పొడి, తదితర వాటిని రుబ్బుకోవడానికి అనువుగా దశాబ్దాల క్రితం రెండు చోట్ల పెద్ద గుండ్లను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఇప్పటికీ వాటినే ఉపయోగిస్తున్నారు. రుబ్బుకోవడం అలవాటైందని.. దీని వల్ల ఆహారం కూడా రుచిగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. నేటి కాలంలో రుబ్బు రోళ్ల వాడకం చాలా అరుదుగా చూస్తుంటాం కదూ. – కొలిమిగుండ్ల